నియంతృత్వ ధోరణి వీడండి

రాజ్యాంగ స్ఫూర్తితో పాలించండి

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రేవంత్‌కు కేటీఆర్ లేఖ

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికైనా నియంతృత్వ ధోరణి వదిలి, ప్రజాస్వామికంగా రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ పరిపాలన సాగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. లేకుంటే సీఎంకి, కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రేవంత్ రెడ్డికి కేటీఆర్ మంగళవారం బహిరంగ లేఖ రాశారు. లేఖ యథాతథంగా..

అంబేద్కర్‌ను అవమానిస్తున్నరు..

'మీ పాలనలో పౌరుల హక్కులను తొక్కేస్తూ, రాష్ట్ర ప్రజలకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నరు. రాహుల్‌గాంధీ రాజ్యాంగ విలువలను కాపాడుతామని చెప్తారు. కానీ, మీ ప్రభుత్వం అన్ని రాజ్యాంగ ప్రమాణాలను, విలువలను, స్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నది. రాజ్యాంగ రూపకర్త, అంబేద్కర్‌కు గౌరవ సూచకంగా కేసీఆర్ ప్రభుత్వం అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. కేసీఆర్‌పై మీకున్న వ్యక్తిగత వ్యతిరేకత వల్ల మీరు ఆ విగ్రహాన్ని ఒక్కసారైనా గౌరవించకపోవడం చూసి చాలా బాధ కలుగుతున్నది. ఇది భారత రాజ్యాంగ రూపకర్తకు నేరుగా మీరు చేస్తున్న అవమానం.

ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులా?

మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మీ పార్టీలో చేర్చుకోవడం ప్రారంభించారు. యాంటీ-డిఫెక్షన్ చట్టాన్ని విస్మరించి, బీఆర్ఎస్ నుంచి చట్ట వ్యతిరేకంగా వచ్చిన ఎమ్మెల్యేలకు మీ ప్రభుత్వం నామినేటెడ్ పదవులు ఇస్తున్నది. భారత రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కు ల్లో ప్రసంగ స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1)(ఎ)) కీలకమైనది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హక్కును తొక్కిపెట్టడం తీవ్రంగా ఆందోళన కలిగించే విషయం. మీ ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే వారిపై, చివరికి సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినా సరే, వారిపై తప్పుడు కేసులు పెట్టడం సర్వసాధారణంగా మారింది. వాక్ స్వాతంత్ర్యంలో కీలకమైన ప్రెస్ స్వేచ్ఛ తెలంగాణలో దాడులకు గురవుతున్నది. మీడియా ప్రతినిధులపై శారీరక దాడులు, తప్పుడు కేసులు నమోదు చేయడం మీ ప్రభుత్వం అరాచకత్వాన్ని బహిర్గతం చేస్తున్నది.

రాజ్యాంగేతర శక్తులుగా మీ సోదరులు

మీ 11 నెలల పాలనలో పోలీసుల వేధింపులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులను కస్టడీలోకి తీసుకొని మానసిక, శారీరక వేధింపులకు గురిచేసిన అనేక ఘటనలు వెలుగుచూశాయి. మీ పాలన కింద తెలంగాణ పోలీస్ రాజ్యంగా మారింది. ఇంతటితో ఆగకుండా, మీ కుటుంబసభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా మారి రాష్ట్ర పరిపాలనలో జోక్యం చేసుకుంటున్నారు. మీరు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల మీ సోదరులు క్విడ్ ప్రో కో విధానంలో నేరుగా లబ్ధిపొందుతున్నారు. హైడ్రాతో ఇష్టమొచ్చినట్టు కూల్చివేతలు చేస్తున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఈ విధమైన కూల్చివేతలను రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చింది. మీరు ప్రజలకు మార్పు అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ఆ మార్పు ఒక మోసం అని తెలంగాణ ప్రజలు గ్రహిస్తున్నారు. సమాజంలోని వివిధవర్గాలు మీ రాజ్యాంగ వ్యతిరేక, అసమర్థ పాలనను వ్యతిరేకిస్తూ రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపడుతున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి

తెలంగాణలో రాజ్యాంగ పరిపాలనను పునరుద్ధరించాలని ప్రజల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నా. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి గౌరవం చూపించేలా రాజ్యాంగ హక్కులు, స్ఫూర్తిని కాపాడుతూ ప్రజలకు పరిపాలన అందించాలని సూచిస్తున్నా. ప్రజలు, మా లాంటి పార్టీలు మీ తీరు మార్చుకొని, ప్రజాస్వామికంగా వ్యవహరించాలని చేస్తున్న విజ్ఞప్తులు, డిమాండ్లను పట్టించుకోకుండా నియంతృత్వంతో, అప్రజాస్వామికంగా మీరు రాజ్యాంగ వ్యతిరేకపాలనను కొనసాగిస్తే, ప్రజలే మీకు, కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పొన్నాల లక్ష్మయ్య, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్

అదానీకి దాసోహం

మొదటిపేజీ తరువాయి...

రద్దు చేయాలనేదే బీఆర్ఎస్ ఏకైక డిమాండ్ అని స్పష్టంచేశారు. అదానీతో కేంద్రం కలిసి చేపట్టిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వానికి అంటగడుతున్నారని మండిపడ్డారు. ఎంపీగా కూడా పనిచేసిన రేవంత్‌రెడ్డికి జాతీయ రహదారుల ప్రాజెక్టులు ఎవరిస్తారో కూడా తెలియదా? అని ప్రశ్నించారు. రామన్నపేటలో ప్రజలు తిరగబడితే కొడంగల్‌లో 9 మిలియన్ టన్నుల సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. అదానీ, అల్లుడు, అన్నలు, బావమరిది కోసమే రేవంత్ పనిచేస్తున్నారని విమర్శించారు. తెలంగాణభవన్‌లో మంగళవారం శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

మరి నువ్వు దొంగవా రేవంత్?

'నేను ప్రశ్నిస్తే సైకోనా? తెలంగాణ వనరులను దొంగకు దోచిపెడితే మరి నువ్వు దొంగవా?' అని కేటీఆర్ నిలదీశారు. 'అదానీ రాష్ట్రం వదిలి వెళ్లాడు అని సీఎం అనుంగు పేపర్‌లోనే వార్త వచ్చింది. ఏదో నిన్న రాహుల్‌గాంధీ ఫోన్ చేసి తిట్లు తిట్టడంతో అట్ల యాక్షన్ చేసిండు. అదానీ వ్యవహారానికి సంబంధించి రెండేండ్ల కిందటే హిండెన్‌బర్గ్ రిపోర్ట్ వచ్చింది. రాహుల్‌గాంధీ ఏమో అదానీ దొంగ అంటుంటారు. రేవంత్‌రెడ్డి మాత్రం ఆయనతో రూ.12,400 కోట్ల ఒప్పందాలు చేసుకుంటారు. కేంద్రం ఇచ్చిన ప్రాజెక్ట్‌లను మేము ఇచ్చామని చెప్తున్నవ్.. నీకు ఏమైనా పరిజ్ఞానం ఉన్నదా? కేసీఆర్ ఏం తప్పు చేసిండని ఆయనను తిడుతున్నవ్? అదానీకి రెడ్ సిగ్నల్ ఇవ్వటమే ఆయన చేసిన తప్పా? బొగ్గు పాలసీ విషయంలో దేశంలో కేంద్రాన్ని నిలదీసిన ఒకే ఒక్కడు కేసీఆర్. నీలా కాళ్లు పట్టుకోవటం, మస్కా కొట్టటం, గౌతమ్ భాయ్ అంటూ చుట్టూ తిరిగే రకం కాదు మేము. రాహుల్‌గాంధీ ఫోన్‌చేసి తిట్లు తిడితే రేవంత్ తప్పు ఒప్పుకున్నారు. బీఆర్ఎస్ దెబ్బకు గత్యంతరం లేక ఫేచేముడ్ అన్నందుకు సంతోషం. కానీ, మూసీని మురికికూపంగా మార్చే అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ఎందుకు అనుమతిచ్చారు? అదానీతో మొత్తం ఒప్పందాలు రద్దు చేసుకోవాలి. మూసీ ప్రాజెక్ట్‌ను కూడా ఏ పాలసీ లేకుండా ఎలా ఇస్తారు?. నువ్వు తప్పు చేసి మా మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న శాడిస్ట్ ముఖ్యమంత్రివి. ఏం చేస్తావో చేసుకో. నీకు భయపడే వాళ్లం కాదు మేము' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

జాతీయ ప్రాజెక్టులు మేమిచ్చినమా?

అదానీకి ప్రధాని ఇచ్చిన ప్రాజెక్టులను రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ఖాతాలో వేసే కుట్రచేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మూడు జాతీయ రహదారుల కాంట్రాక్టులటల.. బీఆర్ఎస్ ప్రభుత్వం అదానీకి ఇచ్చిందట. ఎన్‌హెచ్ఏఐ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ కింద పనిచేసే ముఖ్యమైన సంస్థ. జాతీయ రహదారుల నిర్మాణానికి ఒప్పందాలు ఈ సంస్థ ప్రధాన బాధ్యత. ఈశాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. ఆయన కేటాయించిన పనులను మాకు అంటగట్టారు. 750 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అదానీ కంపెనీకి ఇచ్చిందని మరో అబద్ధపు ముచ్చట చెప్పిండ్రు. విద్యుత్తు ప్రాజెక్ట్ కూడా కేంద్రం ఇచ్చిందే. కేంద్రంలోని విద్యుత్తు మంత్రిత్వశాఖ 750 కేవీ విద్యుత్తు ప్రసరణ ప్రాజెక్టుల కోసం ఒప్పందాలు కేటాయిస్తుంది. ఇవి తెలియకుండా మాట్లాడితే ఏమనుకోవాలి' అని కేటీఆర్ దుయ్యబట్టారు. 'రక్షణశాఖ పరిధిలోకి వచ్చే పెట్టుబడులను బీఆర్ఎస్‌కు అట్టగట్టడం మూడో అబద్ధం. రక్షణశాఖకు ఇచ్చిన ప్రాజెక్టులను మేమిచ్చామంటున్నరు. రక్షణ శాఖ మా చేతిలో ఉంటుందా? ముఖ్యమంత్రి చెప్పే అబద్ధాలను మీడియా కూడా ప్రశ్నించాలి. డ్రైపోర్ట్ కూడా కేంద్ర, రాష్ట్రానికి సంబంధించిన అంశం. కేంద్రం అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. దాన్ని కూడా మేము ఎవ్వరికీ ఇవ్వలేదు. కానీ ఇచ్చినట్టు చూపించారు' అని కేటీఆర్ మండిపడ్డారు.

మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు అదానీవట!

మైక్రోసాఫ్ట్ సంస్థ నుంచి రెండు దఫాలుగా 37 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని కేటీఆర్ గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ నుంచి ఒకసారి రూ.15 వేల కోట్లు, రెండోసారి రూ. 16 వేల కోట్ల పెట్టుబడులు పట్టుకొచ్చామని వివరించారు. కానీ ఈ ముఖ్యమంత్రి మాత్రం అది అదానీ డాటా సెంటర్ అని రిలీజ్ చేశారని, మైక్రోసాఫ్ట్ డాటా సెంటర్ పెట్టుబడిని అదానీ డాటా సెంటర్ అని అబద్ధపు ప్రచారం చేశారని మండిపడ్డారు. 'నీకు సబ్జెక్ట్ తెలియక ఏది పడితే అది మాట్లాడితే రాష్ట్ర గౌరవం మంటగలుస్తుంది. గతంలో కూడా విప్రో చైర్మన్ సత్యనాదెళ్ల అని చెప్పి నవ్వులపాలైనవ్. మైక్రోసాఫ్ట్ వచ్చాక హైదరబాద్‌కు అమెజాన్ వచ్చింది. అమెజాన్ రూ.36 వేల కోట్లు పెట్టుబడులు పెట్టింది. మొత్తం రూ.67 వేల కోట్ల విదేశీ పెట్టుబడులను మేము తీసుకొచ్చినం. పదేండ్లపాటు కష్టపడి సృష్టించిన తెలంగాణ రాష్ట్ర సంపద నాలుగుకోట్ల తెలంగాణ పేదలకు దక్కాలె తప్ప పెద్దలకు, గద్దలకు కాదన్నది మా సిద్ధాంతం' అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

అదానీని నీలా రహస్యంగా కలవలేదు

దావోస్‌లో అదానీ చేసిన ప్రతిపాదనలను బీఆర్ఎస్ ప్రభుత్వం తిరస్కరించిందని కేటీఆర్ గుర్తుచేశారు. 'నేను అదానీని కలిశానని ఫొటో రిలీజ్ చేశారు. బరాబర్ దావోస్‌లో కలిసిన. ఆ ఫొటో నేనే ట్విట్టర్‌లో పెట్టిన. నీలా ఇంటికి పిలిపించుకొని నాలుగు గంటలు రహస్యంగా కలవలేదు. వందకోట్లు నజరానా తీసుకోలేదు. కోహినూరు హోటల్‌లో కాళ్లు పట్టుకోలేదు. నాకు నీలా లుచ్చా పనులు చేసే అలవాటు లేదు. ఏదీ చేసినా బజాప్తా చేస్తా. అదానీని మేము ఏరోజూ ఎంకరేజ్ చేయలేదు. అదానీకి తెలంగాణలో ఏంట్రీలేదని బరాబర్ చెప్పినం. మీలా వందల ఎకరాల భూములను అప్పగించేందుకు, వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాల పేరుతో దోచిపెట్టే కుట్రచేయలేదు. నీలా ఆయన కాళ్లు ఒత్తుకుంటా ఉండే అలవాటు నాది కాదు' అని ధ్వజమెత్తారు.

అరెస్టులు, నిర్బంధాలేనా ప్రజాపాలన?

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడమేనా ప్రజాపాలన అంటే? అని కేటీఆర్ ప్రశ్నించారు. 'శైలజ అనే విద్యార్థిని చనిపోతే వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు మా పార్టీ నేత కోవ లక్ష్మి వెళ్తా ఉంటే ఆమెను హౌస్‌అరెస్ట్ చేసిండ్రు. అనిల్‌జాదవ్, జాన్సన్‌నాయక్ లాంటి నేతలను కూడా అరెస్టు చేసిండ్రు. వాళ్లు పోతే నీకు ఏమైందయ్యా. ఇంటర్ నెట్ షట్‌డౌన్, అక్రమ అరెస్టులు, నిర్బంధాలు ఇదేనా ప్రజాపాలన? ఏడాదిలో అదానీ, అల్లుడు, అన్న, బావమరిది సృజన్‌రెడ్డికి అమృతం పంచటం కోసం తప్పా.. నువ్వు చేసిన మంచి పనేంది? అసలు అదానీ చెక్ ఇచ్చి 38 రోజులు అయినా ఇప్పటి వరకు ఎందుకు క్యాష్ చేయలేదు? అంటే చెక్ చూపించి వెనక నుంచి ఆ డబ్బు దొబ్బేసే కుట్ర చేస్తున్నారు. అదానీ ఫ్రాడ్ అని రేవంత్‌రెడ్డికి నిన్ననే తెలిసిందా? మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో అదానీని గజదొంగ అంటివి. మహారాష్ట్ర లోగజదొంగ తెలంగాణలో సుద్దపూస అయ్యిండా? ఆయన చెక్ ఇవ్వలేదు. అది క్యాష్ కాలేదు. ఏదో తమాషా చేసిండు. అదానీతో రూ.12,440 కోట్ల పెట్టుబడులు అని చెప్పిండ్రు. అందులో పంప్డ్ స్టోరేజ్ పాలసీ అంట. అసలు తెలంగాణలో పంప్డ్ స్టోరేజీ పాలసీ ఉన్నదా? ముఖ్యమంత్రి చెప్పిన వాటిల్లోనే రెండు అంశాలు బయటపడ్డయి. రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ పాలసీ లేదు. కొడంగల్‌లో అల్లుడి కోసం భూములు తీసుకుంటుండనుకున్నం.. కానీ ఇప్పుడు అదానీ కోసమని తెలిసింది. రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమను ప్రజలు వద్దన్నా పెడుతూ మూసీని కలుషితం చేస్తారట. మళ్లీ కొడంగల్‌లో కూడా అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెడుతారట' అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

ఎవరు పిచ్చోడో వాళ్లే తేల్చుకోవాలి

'మీడియా మిత్రుడు ఒకరు నిన్న మేఘా సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని హైదరాబాద్ వాటర్ బోర్డు రిపోర్ట్ ఇచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తే.. ఎవడో పుల్లయ్య, మల్లయ్య చెప్పిండు అన్నడు. ఎల్లయ్య, మల్లయ్య చెప్పలేదు. ప్రభుత్వంలోని నీ శాఖనే చెప్పిందన్న సోయి కూడా లేదు. ముఖ్యమంత్రికి అంతా కన్ఫ్యూజనే. రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని బద్నాం చేసేలా తప్పుడు ప్రచారం చేస్తుంటే మీడియా ఆ ట్రాప్‌లో పడొద్దు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మధ్య సయోధ్య ఉన్నదా? ఆయన పిచ్చోడా, ఈయన పిచ్చోడా? వాళ్లే తేల్చుకోవాలి' అని కేటీఆర్ దుయ్యబట్టారు.

చీకట్లో రాహుల్ కాళ్లు పట్టుకోడానికే..

ప్రజల డబ్బు వెచ్చించి ప్రత్యేక విమానాల్లో ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రజలకు న్యాయం చేయాలని కేటీఆర్ సూచించారు. 'రాష్ట్రాభివృద్ధి కోసం ఢిల్లీకి పోతే మంచిదే. 28 సార్లు ఢిల్లీకి పోయి రూ. 28 కూడా తేలేదు. నువ్వు పెద్ద బృందంతో వెళ్లి పెట్టిన ఖర్చు కూడా పడ్తల్ కాకపోతే ఎట్లా? బీజేపీతో చీకటి ఒప్పందం, రాహుల్ గాంధీని కలిసి ఆయనకు మూటలు ఇచ్చి కుర్చీ కాపాడుకునేందుకే నువ్వు ఢిల్లీ వెళ్లేది. రేవంత్ ఢిల్లీ వెళ్లేది చీకట్లో రాహుల్ కాళ్లు పట్టుకోడానికే తప్ప ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కాదు' అని దెప్పిపొడిచారు.

లోకం పోకడ

నన్ను సొంత అమ్మలాంటిదానివని అంటూంటే, ఏం సాయం చేస్తాడో అని సంబరపడ్డా.. ఇంత పనిచేస్తడనుకోలేదు!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	9.7°c	28.8°c
రంగారెడ్డి	9.8°c	33.5°c
మెదక్	10.0°c	33.3°c
నిజామాబాద్	13.5°c	28.1°c
ఖమ్మం	15.0°c	28.0°c
మహబూబ్‌నగర్	15.1°c	30.4°c
కరీంనగర్	16.0°c	28.0°c
వరంగల్	16.0°c	28.0°c
హైదరాబాద్	16.0°c	29.8°c
నల్లగొండ	18.0°c	28.0°c

వేల మందితో దీక్షాదివస్: ఆనంద్

వికారాబాద్, నవంబర్ 26, (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. 29న వికారాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న దీక్షాదివస్‌ఖ/ అందరూ హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీశైల్‌రెడ్డి పాల్గొన్నారు.

పునరావాసం తర్వాతే ప్రక్షాళన

మొదటిపేజీ తరువాయి...

భూసేకరణ చట్టం ప్రకారం తగిన పరిహారం చెల్లించాకే చర్యలు ఉండాలని తెలిపారు.

నీటివనరుల రక్షణకు మిషన్ కాకతీయ

మూసీ వరదలు 1908లో ముంచెత్తడంతో నాటి నిజాం పాలకులు జంట జలాశయాలను నిర్మించారని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆనాడే పటిష్టమైన ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ - 1317 అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 24 పబ్లిక్ రోడ్లు, దారులు, బ్రిడ్జీలు, గుంతలు, నదులు, చెరువులు, ట్యాంకులు, కుంటలు, కాలువలు, నీటి ప్రవాహాలపై సర్వహక్కులు ప్రభుత్వానివేనని చెప్పారు. నీటి వనరుల పరిరక్షణలో భాగంగా పూడికతీత, బండ్‌లు ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకాన్ని చేపట్టిందని కొనియాడారు. ఇందులో భాగంగా ప్రభుత్వం బిల్డింగ్ నిబంధనలు రూపొందించిందని, జీవో 168 జారీ చేసిందని చెప్పారు. అందులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీల్లేదనే నిబంధనలున్నాయని గుర్తుచేశారు దేశంలోనే మొదటిసారిగా 48 వేల మేజర్, మైనర్ చెరువుల్లో పూడికతీతను దశలవారీగా చేపట్టాలని నాటి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. ట్యాంకులు, చెరువుల భూములను నిషేధిత జాబితాలో చేరుస్తూ సీసీఎల్‌ఏ ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు.

కింది కోర్టులకు సూచనలు..

రివర్‌బెడ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాల్లో ఉన్న తాత్కాలిక, అనధికారిక నిర్మాణాలను నిర్దిష్ట గడువులోగా తొలగించడానికి చర్యలు చేపట్టాలని న్యాయమూర్తి ఆదేశించారు. అధికారులు బిల్డింగ్ నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలని, నిబంధనలకు విరుద్ధంగా మూసీ నదిలో ఉన్న నిర్మాణాలను చట్టప్రకారం తొలగించాలని పేర్కొన్నారు. మూసీ నదిలో అక్రమ నిర్మాణాల తొలగింపుపై ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీచేసే ముందు 2023లో ఇదే హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని కింది కోర్టులకు ఆదేశాలు జారీచేశారు. అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించడానికి నిర్వహించే సర్వేకు పిటిషనర్లు, ప్రజలు, ఆక్రమణదారులు ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా సంయమనం పాటించాలని ఆదేశించారు. ఈ కోర్టు ఉత్తర్వుల అమలు నిమిత్తం నీటిపారుదల, రెవెన్యూ, హైడ్రా, మున్సిపల్ శాఖలకు అవసరమైన భద్రతను కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నదులు, నీటి వనరులు, సరస్సులను, చెరువులను ఆక్రమించుకున్న అక్రమార్కులపై వాల్టా చట్టం కింద క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హెచ్‌ఎండీయే అనుమతులు మంజూరు చేసిన లేఔట్ నుంచి కొనుగోలు చేశామని, జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టాక కూల్చివేతలు చేపట్టారని తెలిపారు. విద్యుత్తు కనెక్షన్లు పొందడంతోపాటు ఆస్తి పన్ను చెల్లిస్తున్నామని, అయితే ఎలాంటి విచారణ జరపకుండా, సర్వే నిర్వహించకుండా, నోటీసు జారీచేయకుండా మూసీ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయంటూ కూల్చివేతలు చేపట్టారని చెప్పారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ. 2021లో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల ద్వారా సర్వే నిర్వహించామని చెప్పారు. మేడ్చల్ - మల్కాజిగిరి, రంగారెడ్డి, హైదరాబాద్‌ల్లో విలేజీ మ్యాప్‌లు, మెజర్‌మెంట్స్ రికార్డుల ద్వారా సర్వే పూర్తిచేసి మండలాల వారీగా శాటిలైట్ మ్యాప్‌లను సిద్ధం చేశామని తెలిపారు. వాటి ఆధారంగా జూలై, ఆగస్టుల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించామని అన్నారు. 50 మీటర్ల బఫర్‌జోన్‌గా పరిగణనలోకి తీసుకోగా 10,017 నిర్మాణాలున్నాయని, ఇందులో 2,166 నిర్మాణాలు రివర్‌బెడ్‌లో, 7851 బఫర్‌జోన్‌లో ఉన్నట్టు గుర్తించామన్నారు. రివర్ బెడ్, బఫర్‌జోన్‌లలో నివాసం కోల్పోతున్నవారి కోసం మానవీయ కోణంలో 15 వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయిస్తూ ప్రభుత్వం సెప్టెంబర్‌లో 754 జీవో జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు పలువురు అంగీకరించారని, మూడు జిల్లాల్లో 319 కుటుంబాలకు పునరావాసం కల్పించడంతోపాటు ఆర్థిక సాయం కూడా అందే ఏర్పాట్లు చేశామని చెప్పారు.

చట్టాలున్నా.. చెరువుల కబ్జా

తెలంగాణ ఇరిగేషన్ చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రత్యేక అధికారిని నియమించే అధికారం ప్రభుత్వానికి ఉందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆ అధికారికి చట్ట ప్రకారం ప్రత్యేక అధికారాలు ఇచ్చినట్టు తెలుస్తున్నదని అన్నారు. జీవో జారీ చేయడం ద్వారా నీటిపారుదల శాఖ అధికారికి బాధ్యతలు, విధులు అప్పగించడం తప్పుకాదని చెప్పారు. ఇరిగేషన్ చట్టంలోని సెక్షన్ 4 కింద విధులు నిర్వహించడానికి ఏ అధికారినైనా నియమించవచ్చని అన్నారు. చెరువులు, నదులు సమాజానికి చెందిన ఆస్తులని, వాటిని ట్రస్టీలుగా అధికారులు నిర్వహిస్తారని తెలిపారు. చెరువుల్లో ఇండ్ల పట్టాలను ఇచ్చినా, కేటాయింపు జరిపినా వాటికి చట్టబద్ధతలేదని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం చట్టం రూపొందించిందని, న్యాయ సమీక్షలో చట్టం తీసుకువచ్చిన ఉద్దేశాలను ఈ కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. మూసీలో పర్యావరణ సమతుల్యత పరిరక్షణ కోసం, భవిష్యత్తు తరాల కోసం ప్రభుత్వం విధివిధానాలను తీసుకువచ్చిందని అన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శోభన్ బాబు (ఫైల్)

చాకలి బాలేశ్ (ఫైల్)

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

వరంగల్, మెదక్ జిల్లాల్లో బలవన్మరణం

దుగ్గొండి/రామాయంపేట, నవంబర్ 26 : దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం.. సాగు కోసం చేసిన అప్పులు భారంగా మారడంతో వరంగల్, మెదక్ జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన హింగె శోభన్‌బాబు (48) మిర్చి, ఇతర పంటలు సాగు చేస్తున్నాడు. సుమారు 10 లక్షల వరకు అప్పులు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో మిర్చి తోట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి, పెద్ద కుమార్తె రవళికి ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి శోభన్‌బాబును నర్సంపేటలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రామాయంపేటలో యువరైతు ..

మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝన్సీలింగాపూర్‌కు చెందిన చాకలి దుర్గోల్ల బాలేశ్ (28)కు రెండెకరాల భూమి ఉన్నది. అందులో బోరుబావులు తవ్వించినా చుక్కనీరు పడలేదు. వేసిన పంట వేసినట్టే ఎండి పోవడంతో తీవ్రంగా కలత చెందాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో దూలానికి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

తిరగబడే రోజులొచ్చాయి: గువ్వల

నాగర్‌కర్నూల్, నవంబర్ 26: కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ కార్యాలయంలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, దీక్షాదివస్ ఇన్‌చార్జి విజయసింహారెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తెగింపు కార్యకర్తలే మా బలం

దీక్షాదివ